క్లుప్తంగా

నేడు ఇప్పెంటకు ఎమ్మెల్యే రాక

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట పంచాయతీకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి వస్తున్నట్లు మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పెంట ఎస్సీ, ఎస్టీ కాలనీ, వెంకట్రామ్‌పల్లె గ్రామాల్లో రామాలయాల కోసం భూమి పూజకు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను సవరించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీల్లోని సాంకేతిక లోపాన్ని సవరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు మనద్‌రెడ్డి, సలాం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పటిష్టం



ప్రమాదకర స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

కడప సిటీ : కడప నగర పరిధిలోని వై జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ గుంతల నుండి ప్రమాదం జరగకుండా అధికారులు మరింత రక్షణ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీ కాలువలు రోడ్డు భాగంలోకి వచ్చి చేరడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' దినపత్రికలో ఇటీవల వార్త ప్రచురితం కావడంతో మొదటగా ఇనుప స్టాండ్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత హెచ్చరిక బోర్డులు పెట్టడంతో వాహనదారులకు ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టినట్లయింది.

ట్రంకురోడ్డులో పైపులైన్ లీకేజీ



జీఎం మ్యారేజ్‌హాల్ ఎదుట రోడ్డుపైకి చేరిన లీకేజీ నీరు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ట్రంకు రోడ్డులో చిలకల బావి సమీపంలోని జీఎం మ్యారేజ్ హాల్ ఎదురుగా మంచినీటి పైపులైన్ లీకవుతోంది. ఫలితంగా పది రోజులుగా తాగు నీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. ప్రస్తుత వేసవిలో నీటి కొరత లేకుండా ఉండాలంటే ఇలాంటి లీకేజీలను అరికట్టాల్సిన అవసర ముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'మానవత'కు దహనవాటిక లీజు బాధ్యతలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని దహనవాటిక నిర్వహణ బాధ్యతలను 'మానవత' స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తూ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దహనవాటికకు సంబంధించిన 3.40 ఎకరాలను నో ప్రాఫిట్, నో లాస్ పద్ధతిలో 30 ఏళ్ల పాటు ఆ సంస్థకు ఇచ్చేలా నిర్ణయించారు. ప్రతి ఏటా ఆ సంస్థ రూ.50వేల లీజును నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. బుధవారం మానవత సంస్థ ప్రతినిధులు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కమిషనర్ ప్రవీణ్‌చంద్ నుంచి అందుకున్నారు.

ఆర్టీపీపీ సీఈకి వినతి

కడప కల్చరల్ : రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఆర్టీపీపీ) నూతన సీఈ టి.నాగరాజుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రికల్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నాయకులు తమ సమస్యలను విన్నవించారు. బుధవారం ఆయన కార్యాలయంలో కలిసిన వారు తొలుత ఆయనకు పూల బొకేను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతన సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై నూతన సీఈ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఖాజాపీర్, ఖాసిం, మగ్బూల్, అల్తాఫ్, హుసేన్, రఫ్, షేక్ షావలీ, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి దేవర

దువ్వూరు : మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో బుధవారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లి దేవర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు బండలాగుడు పోటీలు

పెద్దమ్మతల్లి దేవర ఉత్సవం సందర్భంగా వృషభరాజములకు బండలాగుడు పోటీలు ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందిస్తామని వారు పేర్కొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత ఉండాలి



మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్



శాస్త్రి నగర్‌లో పర్యటనలో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలలు పునః ప్రారంభం నాటికి నాడు-నేడు పనులను పూర్తి చేసి విద్యార్థులకు భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కడప నగరపాలక కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. బుధవారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, గాంధ్లస్ట్రీట్‌లోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల నాణ్యతను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణరావు, 9వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కిరణ్, హెచ్‌ఎం నాగమణి, యాస్మిన్‌బేగం,ఏఈ స్వరూప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : కడప నగరంలో చేపట్టే నూతన నిర్మాణాల ప్లాన్ అప్రూవల్స్‌ను పరిశీలించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో ఆయన దర్గామిట్ట, విజయనగర్ కాలనీ, చెమ్ముమియ్యాపేట, శాస్త్రి నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీస్థలాల్లో చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని, సంబంధిత స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేసే కమర్షియల్ వ్యాపారస్తులకు జరిమానా విధించాలని ఆదేశించారు. శాస్త్రి నగర్ ట్యాంకు వద్ద పార్కు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నెహ్రూనగర్ పార్కు, ఇండోర్ స్టేడియం, మున్సిపల్ స్టేడియం ప్రాంతాల్లో నిర్మిస్తున్న టాయ్‌లెట్లను పరిశీలించారు. అక్కాయపల్లె అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలించి అక్కడి రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున కిరణ్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసిన కమిషనర్

కడప రూరల్: కడప నగరం అక్కాయపల్లె డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం కడప కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులతో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహబూబ్‌బాష, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి హోండా షైన్-100 సీసీ బైక్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్‌లోగల వీకే హోండా షోరూంలో బుధవారం సాయంత్రం హోండా టూ వీలర్ కంపెనీ వారి హోండా షైన్-100 సీసీ వాహనాన్ని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల తయారీలో హోండా కంపెనీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ నుంచి విడుదలైన వాహనం వివిధ ప్రత్యేకత కలిగి ఉందని వివరించారు. షోరూం జీఎం ఎంవీఎస్ వర్మ, సేల్స్ మేనేజర్ జె.వెంకటేశ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



నూతన బైక్‌ను విడుదల చేస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్

చిత్రలేఖనంపై శిక్షణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు పాడుపు కథలు, నీతి కథలు బోధించారు. అలాగే విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి స్నాక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

పులివెందుల టౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవా రం స్థానిక రాణీతోపు పార్కులో లైఫ్ కార్యక్రమంలో భాగంగా లైఫ్‌స్టైల్ ఫర్ లివింగ్ ప్రో గ్రాం నిర్వహించి ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత వరకు వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు.

చదువుతోపాటు ఆటలు అవసరం

వల్లూరు : విద్యార్థులకు చదువుతోపాటు ఆట లు కూడా అవసరమని వల్లూరు శాఖా గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం ఆమె విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, చెస్ వంటి ఆటలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారి చేత ఆటలను ఆడించారు. విద్యార్థులకు నీతి కథలను బోధించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని సీకేదిన్నె గ్రంథాలయ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఇబ్రహీం తెలిపారు. బుధవారం సీకేదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చదరంగం, ఆటలపోటీలు, కథలు వంటి పోటీలను నిర్వహించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చెన్నూరు: చెన్నూరులోని ఒకటో వార్డు మైనార్టీ కాలనీ బజారు వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని మండల కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ వారిస్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్‌రెడ్డికి తెలియజేయగా ఆయన ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.5000 ఆర్థికసాయం అందించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడపలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద రాష్ట్ర సమితి సమ్మేళనాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అందించి, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర సమితి సమ్మేళనాల్లో భాగంగా 27న పాత కలెక్టరేట్ నుంచి కార్మికుల ప్రదర్శన, సభ ఉంటుందన్నారు.

గోవాకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి విహార యాత్రకు కడప రీజియన్‌లోని కడప, మైదుకూరు డిపోల నుంచి ఈనెల 26, 27 తేదీలలో గోవాకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి ఇంద్ర ఏసీ సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ బస్సులో ఒక్కొక్కరికి టిక్కెట్ రూ. 3074లుగా నిర్ణయించామన్నారు. అలాగే 27న మైదుకూరు డిపో నుంచి వయా ప్రొద్దుటూరు మీదుగా సూపర్ లగ్జరీ సర్వీసును నడుపుతున్నామన్నారు. ఇందులో చార్జీ రూ. 2386గా ఉందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేలాంగణికి ప్రత్యేక సర్వీసులు

ఈనెల 26వ తేదిన తిరుపతి, తిరుత్తణి, కంచి, నాగూరు, నాగపట్నం మీదుగా వేలాంగణికి కడప, మైదుకూరు డిపోల నుంచి సూపర్ లగ్జరీ సర్వీసులను నడుపుతున్నామన్నారు. మైదుకూరు డిపో నుంచి సాయంత్రం 7.00 గంటలకు, కడప డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఛార్జీ ఒక్కొక్కరికి రూ. 2283గా ఉంటుందన్నారు. ఈ సర్వీసులు 28వ తేదిన వేలాంగణిలో ఉదయం 11 గంటలకు బయలుదేరుతాయన్నారు.

తిరుమన్నామలైకు

కడప రీజియన్ పరిధిలో కడప, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోల నుంచి జూన్ 2, 3 తేదీల్లో తమిళనాడులోని తిరుమన్నామలైకి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఆయా సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రామసునీల్‌రెడ్డి పదవీ కాలం పొడిగింపు



కడప కార్పొరేషన్ : ఎస్వీ గోసంరక్షణ శాల డైరెక్టర్‌గా ఉన్న ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ డి. రామసునీల్ రెడ్డి పదవీకాలం మరో ఏడాది పెంచుతూ టీడీడీ ఈఓ ధర్మారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆయన్ను ఈ పదవిలో నియమించిన టీటీడీ, ఆయన సేవలను గుర్తించి మరో ఏడాదిపాటు ఈ పదవీకాలాన్ని పొడిగించింది. ఈ సందర్భంగా రామసునీల్‌రెడ్డి మాట్లాడుతూ తన పదవీ కాలం పొడిగింపునకు కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు 30 రోజులపాటు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు 18 నుంచి 45 ఏళ్ల లోపు కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని, దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94409 05478, 63028 33546 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

పులివెందుల : దెబ్బతిన్న అరటి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి నివేదిక అందించాలని ఉద్యాన శాఖ అధికారులకు తెలిపామన్నారు. దెబ్బతిన్న అరటి తోటలను ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి వెలమవారిపల్లె, వై.కొత్తపల్లె గ్రామాల్లో పరిశీలించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాథమికంగా నియోజకవర్గంలో 26 గ్రామాల్లో 1049 మంది రైతులకు చెందిన 957 హెక్టార్లలో అరటి పంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణ కూడా చేపట్టారని తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ప్రభుత్వానికి అందజేసి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఓఎస్డీ తెలిపారు.



దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాలెం సచివాలయ పరిధిలోని కదిరేపల్లె, తాటిమాకులపల్లె, యు.రాజుపాలెం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. అలాగే గురువారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు నిర్వహించాల్సిన సన్మాన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రద్దయిందని ఈ విషయాన్ని అధికారులు, నాయకులు, కార్యకర్తలు గమనించాలని ఆయన కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, యు.రాజుపాలెం సచివాలయ సిబ్బంది, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు.

'దిశ'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు, యువతులు దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి తెలిపారు. యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో మహిళల అక్రమ రవాణా, దిశ యాప్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిశ చట్టం గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ చట్టం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. దిశ పోలీసు ఎస్ఐ లక్ష్మీదేవి, వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని చట్టాలు వచ్చినా చాలాదేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉన్నారు. ఇటువంటి వాటి గురించి మహిళలు అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ అధినేత ఇంతియాస్ అహ్మద్, మేనేజర్ సుబ్బరామిరెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని బీడి కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు కోరారు. బుధవారం నగరంలోని బీడి కాలనీ, మాసాపేట, నకాష్, సాయిపేట ప్రాంతాలలో బీడీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా బీడీలు చుట్టే వారు ప్రాణాంతకమైన టీబీ, కేన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వీరికి తక్కువ వయస్సులోనే కిడ్నీలు దెబ్బతిని అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడి కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడి కార్మికులకు సంక్షేమ పథకాలను సత్వరమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, జమీల, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సేవలను వినియోగించుకోవాలి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సేవలను ప్రవాసాంధ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. బుధవారం కువైట్‌లోని సాల్మియా ప్రాంతంలో నిర్వహించిన కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో చైర్మెన్ మేడ పాటి వెంకట్ నేతృత్వంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారి సమస్యలను పరిష్కరించడంలో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ముందుందన్నారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సేవలను వినియోగించుకునేలా కడప ఇస్లామిక్ సొసైటీ వారు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కువైట్ కన్వీనర్ ఎం. బాలిరెడ్డి , ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కువైట్ కో కన్వీనర్లు గోవిందు నాగరాజు, ఎం.వీ నరసారెడ్డి, సొసైటీ సభ్యులు న్యామతుల్లా, లక్కీ అజీస్, షామీర్, ఖాదర్, అక్బర్, యూసుఫ్, మహమ్మద్ సలీమ్, ఇంతియాజ్, జాహిద్ పాల్గొన్నారు.



కువైట్‌లో సమావేశమైన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులు

డీఎస్సీ -98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : 1998 డీఎస్సీ క్వాలిఫై అయ్యి సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలను ఇవ్వాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై బుధవారం టీచర్స్ ఎమ్మెల్సీ యంవీ. రామచంద్రారెడ్డిని కడపలో కలిసి సంబంధిత సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి క్వాలిఫై అయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యు నాయకులు స్వరూప్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం కుంభప్రతిష్ఠ, అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, మూలవిరాట్‌లకు అభిషేకం, ఉత్సవబలి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి గుడిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు స్వామి వార్లకు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం ఎదురుకోళ్లు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గంగ జాతర ప్రారంభం

రాజుపాళెం : అర్కటవేముల గ్రామంలో పాత గంగమ్మ దేవాలయం వద్ద బుధవారం నుంచి గంగ జాతర (ఆవుల పబ్బం) ఘనంగా ప్రారంభమైంది. ఉదయం గ్రామ దేవతలకు పూజలు, సాయంత్రం అమ్మవారికి జల్ది స్థానం అఖండ జ్యోతి, కలశ స్థాపన చేశారు.

28న రాష్ట్రస్థాయి సీనియర్స్ వృషభరాజముల పోటీలు

గంగ జాతరను పురస్కరించుకొని ఈ నెల 28న ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి సీనియర్స్ వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన వృషభరాజములకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,00,016, రూ.70,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000లను అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి ఇంటికీ 24 గంటలు శుద్ధినీరు అందిస్తా

- రూ.58.2 కోట్లతో సమగ్ర తాగునీటి పథకానికి భూమిపూజ
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణంలో ప్రతి ఇంటికీ 24 గంటలు శుద్ధినీరు అందిస్తామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక అర్బన్ పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన సమగ్ర తాగు నీటి సరఫరా పథకానికి ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డితో కలసి ఎమ్మెల్యే భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నాణ్యమైన శుద్ధి నీటిని అందించడం కోసం రూ.58.2 కోట్లతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో డ్రైనేజీలోనే నీటి పైప్‌లైన్‌లు ఉండేవని, అందులో నీరు కలుషితం కావడంతో పాటు అవే నీరు కుళాయిలకు వచ్చేవన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినేదన్నారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కమలాపురం పర్యటనలో భాగంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం కార్యచరణ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 4 ఈఎల్ఎస్ఆర్‌లు వస్తాయన్నారు. అలాగే ఈ పని పూర్తి కాగానే రూ.38 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఇప్పటికే రూ.36 కోట్లతో డ్రైన్స్ పూర్తి చేశామన్నారు. మరో రూ.14.5 కోట్లతో ఓపెన్ డ్రైన్స్, రూ.8 కోట్లతో స్ట్రాం వాటర్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.6.5 కోట్లతో రోడ్డు డివైడర్, బ్యూటిఫికేషన్ చేపడతామన్నారు. మరో నెల రోజుల్లో 50 పడకల ఆసుపత్రి ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాలను వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. త్వరలో ఆర్‌ఓబీ, బైపాస్ నిర్మాణాలను చేపడతామన్నారు. కమలాపురం పట్టణం కడప, ప్రొద్దుటూరుకు మధ్యలో జగనన్న ఇండస్ట్రియల్ హబ్‌కు అతి సమీపంలో ఉండటంతో ఈ పట్టణాన్ని అన్ని సౌకర్యాలతో మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కమలాపురం పట్టణం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద కోట్ల నిధులు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. కమలాపురం ప్రజల చిరకాల కోరిక ఆర్‌ఓబీ నిర్మాణానికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో రూ.33 కోట్లు మంజూరు చేశారన్నారు. అయితే అప్పట్లో నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడే తిరిగి ఆర్‌ఓబీ, బైపాస్ నిర్మాణానికి నిధులు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. కమలాపురం నియోజకవర్గ అభివృద్ధి ఇన్ని వందల కోట్ల నిధులు విడుదల చేశారంటే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు.



సమగ్ర సాగునీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసి చైర్మన్ మల్లికార్జున రెడ్డి

కడపలో మొల్ల అకాడమీ ఏర్పాటు చేయాలి

గోపవరం : వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో తెలుగు రామాయణ తొలి రచయిత్రి మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేయాలని కవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మొల్ల మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాలివాహన వంశంలో జన్మించిన మొల్ల ఏడు దశాబ్దాల క్రితమే మహిళా సాధికారతకు పాటు పడ్డారన్నారు. తన రామాయణ రచనలో సీతాదేవికి ఇతర మహిళలకు పెద్దపీట వేసి మహిళా ఔన్నత్యానికి కృషి చేశారన్నారు. తెలుగుభాష సుసంపన్నం కోసం తన పేరుతో మొల్ల రామాయణాన్ని సరళమైన భాషలో రచించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి జిల్లా కేంద్రమైన కడపలో మొల్ల పేరుతో తెలుగు అకాడమీ నెలకొల్పాలని కోరారు. ముందుగా మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్ల సాహితీ పీఠం కోశాధికారి గుమ్మళ్ల శ్రీనివాసులు, పెంచలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.